

చిరుధాన్యాల పుట్టినిల్లు అనంత

చిరుధాన్యాల సాగుకు 'అనంత' పుట్టినిల్లని వక్తలు పేర్కొన్నారు. శనివారం నగరంలో 'మిల్లెట్ మేళా' ప్రారంభమైంది.

8లో



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

మెడాల్ అక్రమాలకు బీజం అనంతలోనే



తెలుగుదేశం పాలనలో జరిగిన భారీ కుంభకోణానికి అనంతపురం జిల్లాలోనే బీజం పడింది. 2015–19 మధ్య కాలంలో ప్రభుత్వాస్పత్రుల్లో రక్తపరీక్షల నిర్వహణను చంద్రబాబు సర్కారు ఔట్ సోర్సింగ్ కింద 'మెడాల్' సంస్థకు కట్టబెట్టింది. పైలట్ ప్రాజెక్ట్ కింద అనంతపురంలో 'బ్రహ్మాండం'గా రక్తపరీక్షలు నిర్వహించారంటూ నివేదిక ఇప్పించి ఆగమేఘాల మీద ఆ సంస్థకే రాష్ట్ర వ్యాప్తంగా రక్తపరీక్షల నిర్వహణను కట్టబెట్టింది. మెడాల్ సంస్థ డాక్టర్లతో కుమ్మక్కై అవసరం ఉన్నా లేకున్నా రక్త పరీక్షలు రాయించి దాదాపు రూ.300 కోట్లు లూటీ చేసింది.

- నాటి టీడీపీ ప్రభుత్వ నిర్వాకం
- ప్రభుత్వాస్పత్రుల్లో 'మెడాల్'కు రక్తపరీక్షల కాంట్రాక్ట్
- 2015 నుంచి 2019 మధ్య కాలంలో రూ.300 కోట్ల లూటీ

నాటి టీడీపీ సర్కారు అనుమతులు ఇలా..

కమిటీ జీఓ ఇచ్చింది	2015 సెప్టెంబర్ 28
కమిటీ తొలి సమావేశం	2015 అక్టోబర్ 3
కమిటీ నివేదిక	2015 అక్టోబర్ 7
ఉచిత పరీక్షలకు అనుమతి	2015 అక్టోబర్ 14
ఉచిత పరీక్షలు అమల్లోకి	2016 జనవరి 1 నుంచి

(ఆరు నెలల్లో నివేదిక ఇచ్చి అమలు చేయాల్సింది.. కానీ నెలన్నరలోనే మెడాల్ సంస్థకు కట్టబెట్టారు)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: చంద్రబాబు అధికారంలో ఉన్నపుడు వైద్య సేవల ముసుగులో భారీ దోపిడీ జరిగింది. రోగులకు ఉచితంగా చేసే రక్త పరీక్షల నిర్వహణను ఔట్‌సోర్సింగ్ ద్వారా ప్రైవేట్‌కు కట్టబెట్టడం ద్వారా ప్రజాధనం దుర్వినియోగమైంది. రక్త పరీక్షల సేవల ఫ్రాంచైజీలు దక్కించుకున్న టీడీపీ నేతలు సైతం అందినంత దోచుకున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో రక్తపరీక్షల నిర్వహణను టీడీపీ ప్రభుత్వం 2015లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ప్రైవేట్ సంస్థకు ఇవ్వాలనుకుంది. ఇందు కోసం పైలట్ ప్రాజెక్ట్ కింద అనంతపురాన్ని ఎంపిక చేసింది. ఈ మేరకు జీఓ 17 జారీ చేసింది. తొలుత జిల్లాలో ఆరు నెలల పాటు రక్తపరీక్షలు నిర్వహించి, విజయవంతమైతే ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలనేది జీఓ సారాంశం. ఆ మేరకు ఆ ఏడాది జూన్‌లో పైలట్ ప్రాజెక్టు మొదలైంది. సెప్టెంబర్ 4న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాధినిర్ధారణ పరీక్షలు ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వాలని నిర్ణయించారు. దీనికోసం సెప్టెంబర్ 28న జీఓ 606 ఇచ్చారు.

కుంభకోణం.. అలా మొదలైంది..

అనంతపురంలో మొదలైన పైలట్ ప్రాజెక్టు మూణ్నెల్లు కూడా పూర్తి కాకముందే.. అంతా బ్రహ్మాండంగా జరిగిందని నివేదిక ఇచ్చారు. కమిటీ నివేదికకు ఆరు మాసాలు గడువు ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ తుంగలో తొక్కారు. ఓవైపు తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ఆస్పత్రుల్లోనే సొంతంగా నిర్ధారణ పరీక్షలు చేసి ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసుకుంటుండగా, ఏపీలో మాత్రం ప్రైవేటుకు అప్పజెప్పి భారీ స్కామ్‌కు తెరలేపారు.

ఒక్కో టెస్టుకు రూ.234

అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో 2016 జనవరి నుంచి ఔట్‌సోర్సింగ్‌కు రక్తపరీక్షల నిర్వహణ అప్పగించారు. ఇందులో 32 రకాల టెస్టులుంటాయి. ఒక టెస్టు చేసినా, అన్ని రకాల టెస్టులు చేసినా ఒక్క నమూనాకు రూ.234 ప్రకారం ప్రభుత్వం 'మెడాల్' సంస్థకు ఇవ్వాలి. దీంతో 'మెడాల్' పంట పండించుకుంది. కేవలం హిమోగ్లోబిన్, యూరిన్ పరీక్షలే లక్షల సంఖ్యలో చేసేవారు. దీనికి ఒక్కో పరీక్షకు బిల్కులో నాలుగు రూపాయలే అవుతుంది. ఇలా లక్షల టెస్టులు చేస్తే ఎంతవుతుందో అంచనా వేయొచ్చు.

నేడు తక్కువ ఖర్చుతో ఎక్కువ మందికి..

ఒకప్పుడు ఒక్కో పీహెచ్‌సీలో రక్తపరీక్షల కోసం ప్రైవేటు కంపెనీకి సగటున నెలకు రూ.6 లక్షలు వ్యయం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రక్తపరీక్షలకు అవసరమయ్యే అన్ని రకాల పరికరాలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వాసుపత్రుల్లోనే ఇప్పుడు మెడాల్ చేసిన వాటికంటే ఎక్కువ రక్త పరీక్షలు చేస్తున్నారు. పీహెచ్‌సీల్లో ల్యాబ్ టెక్నీషియన్లను నియమించింది. ప్రతి నెలా పీహెచ్‌సీలో మెరుగైన వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఆస్పత్రిలోనూ ఉచిత రక్తపరీక్షలు, సొంత ల్యాబొరేటరీలు ఏర్పాటయ్యాయి. ప్రజారోగ్య వ్యవస్థ ఇప్పుడు ఏపీలో కేరళ, తమిళనాడులకు దీటుగా ఉందన్నది నీతి ఆయోగ్ లాంటి సంస్థలే చెబుతున్నాయి.

అప్పుడంతా అవినీతే

- ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల డాక్టర్లతో కుమ్మక్కయిన మెడాల్ ప్రతినిధులు యూరిన్, హిమోగ్లోబిన్, లేదా షుగర్ టెస్టులు వేల సంఖ్యలో రాయించుకునేవారు.
- ప్రతి జిల్లాలో తెలుగుదేశం పార్టీ నేతలకు ఫ్రాంచైజీల పేరిట ప్రైవేటు ల్యాబ్‌లు అప్పగించారు.
- కొన్ని ఆస్పత్రుల్లో గర్భిణుల రక్తనమూనాలు సేకరించి టెస్టు చేయకుండానే ఫలితాలు ఇచ్చేవారు.
- రాష్ట్రంలో ఏటా 5వేలకు మించి మలేరియా కేసులు నమోదయ్యేవి కావు. అలాంటిది డబ్బు కోసం 2018లో 50 వేల మలేరియా కేసులకు టెస్టులు చేసినట్టు డ్యాష్‌బోర్డులో పొందుపరిచారు. ఈ విషయాన్ని అప్పట్లో 'సాక్షి' దినపత్రిలో పతాక శీర్షికతో రాయగా డ్యాష్‌బోర్డులో ఉన్న మలేరియా టెస్టులు తొలగించి 6వేలకు కుదించారు.
- ఔట్‌సోర్సింగ్‌కు రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామన్న సాకుతో ఒక్క పీహెచ్‌సీలో గానీ, సీహెచ్‌సీలో గానీ ల్యాబ్ టెక్నీషియన్లను నియమించలేదు.
- మెడాల్ సంస్థ అప్పట్లో తెలుగుదేశం నేతలకు ఫ్రాంచైజీలు ఇచ్చినందుకు భారీగా ముడుపులు అందినట్టు తేలింది.

న్యూస్‌రీల్

23న రేకులకుంట ఏఆర్‌ఎస్‌లో కిసాన్‌మేళా

అనంతపురం అగ్రికల్చర్: ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధంగా బుక్కరాయసముద్రం రేకులకుంట వద్ద ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్‌ఎస్)లో ఈ నెల 23న జోనల్‌స్థాయి కిసాన్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతాలలో ప్రతికూల వాతావరణ పరిస్థితులకు అనువైన పంటల యాజమాన్యం' అనే అంశంపై చర్చాగోష్ఠి, పరిశోధనా ఫలితాలపై చర్చ ఉంటుందని వెల్లడించారు. భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ- హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. వ్యవసాయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రోబోట్, డ్రోన్లు, యాంత్రీకరణ, ప్రభుత్వ, ప్రైవేట్ విత్తన, పురుగు మందులు, ఎరువులు, టిష్యూకల్చర్ మొక్కలు, జీవన ఎరువులకు సంబంధించిన ప్రదర్శన శాలలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాల ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కిసాన్‌మేళాను విజయవంతం చేయాలని కోరారు.

సర్వే వేగవంతం చేయండి



బెళుగుప్పలో కుల గణన సర్వే శాతాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి

బెళుగుప్ప: కుల గణన సర్వేను సచివాలయాల పరిధిలో వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి సూచించారు. శనివారం బెళుగుప్ప మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి కుల గణన సర్వే ఆన్‌లైన్ సర్వే శాతాన్ని ఎంపీడీఓ రామచంద్రతో కలసి పరిశీలించారు. కొన్ని సచివాలయాల పరిధిలో సింగిల్ డిజిట్ సర్వే శాతం ఉండటాన్ని గుర్తించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వేగవంతం చేయాలని ఆదేశించారు. అధికారులతో ఎంపీడీఓ మానిటరింగ్ చేసి సర్వే వేగవంతం చేయాలని సీఈఓ సూచించారు.

జోరుగా కుల గణన సర్వే

అనంతపురం రూరల్/ అర్బన్: జిల్లాలో కుల గణన సర్వే ప్రక్రియ జోరుగా సాగుతోంది. తొలిరోజు శుక్రవారం 10, 757 కుటుంబాలను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్వే చేశారు. రెండో రోజు శనివారం 663 సచివాలయాల పరిధిలో 71,923 కుటుంబాల నుంచి వివరాలు సేకరించినట్లు సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇంటింటికీ తిరిగి పక్కాగా కుల గణన సర్వే చేపడుతున్నట్లు చెప్పారు.

జేఎన్‌టీయూ పురోగతికి సమష్టి కృషి



బాధ్యతలు చేపడుతున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం సమగ్రాభివృద్ధి చెందాలంటే సమష్టి కృషితోనే సాధ్యమని నూతన వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన వీసీగా బాధ్యతలు చేపట్టారు. యూనివర్సిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వీసీకి రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్లు ఈ.కేశవరెడ్డి, పి.సుజాత, జీవీ సుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణకాంతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.చంద్రమోహన్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, బి.దుర్గాప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.

370 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్

అనంతపురం టౌన్: కూడేరు మండల కేంద్రంలో 370 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ తెలిపారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు భూ సేకరణ పూర్తి చేసినట్లు చెప్పారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న యువ పారిశ్రామికవేత్తలకు అనువుగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు సంయుక్తంగా భూ సర్వేను వేగవంతంగా చేస్తున్నామన్నారు. ఈ నెలాఖరులోపు ఇండస్ట్రియల్ పార్క్‌లో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. కూడేరు ఎంఎస్‌ఎంఈ పార్క్‌లో దాదాపు 1000కి పైగా ప్లాట్లను ఏర్పాటు చేసి పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతి పెద్ద ఎంఎస్‌ఎంఈ పార్క్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాప్తాడు ఎంఎస్‌ఎంఈ పార్క్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంతో పారిశ్రామికవేత్తలు వేగవంతంగా పరిశ్రమలు నెలకొల్పుతున్నట్లు చెప్పారు. దాదాపు 40కిపైగా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యాయన్నారు. వీటితోపాటు రాయదుర్గం నియోజకవర్గం వేపరాళ్ల, గార్లదిన్నె మండలం కసుంపల్లి గ్రామాల మధ్య ఎంఎస్‌ఎంఈ పార్క్‌ల కోసం స్థలాన్ని సేకరించేందుకు ఏపీఐఐసీ ముందడుగు వేసిందన్నారు.

శరవేగంగా సబ్ స్టేషన్ల నిర్మాణం

- నెలాఖరులో నాలుగు ప్రారంభం

అనంతపురం టౌన్: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ సంస్థ నూతన సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఒక్కోదానికి రూ.2.2కోట్ల నిధుల చొప్పున అనంతపురం డివిజన్ వ్యాప్తంగా ఆరు సబ్ స్టేషన్ల నిర్మాణాల కోసం రూ.13.2 కోట్ల నిధులు కేటాయించినట్లు విద్యుత్ శాఖ ఈఈ జేవీ రమేష్ తెలిపారు. అనంతపురం రూరల్ మండలం కొడిమి, ఉప్పరపల్లి, జేఎన్‌టీయూ టిడ్కో ఇళ్లు, బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి, నార్పల మండలం దుగుమర్రి, బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలు పూర్తయిన కొడిమి, ఉప్పరపల్లి, అప్రాచెరువు, చెన్నంపల్లి సబ్‌స్టేషన్లను ఈ నెలాఖరులోపు ప్రారంభించనున్నట్లు చెప్పారు. టిడ్కో ఇళ్ల వద్ద సబ్ స్టేషన్ నిర్మాణ పనులు 50 శాతానికి పైగా పూర్తయినట్లు తెలిపారు. నార్పల మండలం దుగుమర్రిలో రెవెన్యూ అధికారులు స్థల సేకరణ చేపడుతున్నారు. కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు పూర్తయితే వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉంటుందన్నారు. వీటితో పాటు తీగల పునరుద్ధరణ పనులు చేపట్టి వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందజేస్తామన్నారు.

సీఎం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేయండి

- అధికారులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచన



హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, తలశిల రఘురాం, కలెక్టర్ గౌతమి, సమన్వయకర్త విశ్వ, ఇతర ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: 'వైఎస్సార్ ఆసరా' కింద డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత సొమ్ము విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న ఉరవకొండకు వస్తున్నందున పర్యటన ఏర్పాట్లు పక్కాగా చేయాలని అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక లత్తవరం రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణమండపంలో సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్, సీఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ పాల్గొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. సభకు వచ్చే మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు కూర్చునేందుకు వీలుగా చైర్లు, తాగునీటి బాటిళ్లు, బిస్కెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయా గ్రామాలకు బస్సులు ఎన్ని కావాలో అన్నీ సిద్ధం చేయాలన్నారు.

బహిరంగ సభాస్థలిని పరిశీలించిన మంత్రి

ఉరవకొండలో అనంతపురం బైపాస్‌లోని భారత్ పెట్రోల్ బంకు పక్కన సీఎం పాల్గొనే బహిరంగ సభా స్థలాన్ని, వెహికల్ పార్కింగ్, హెలిప్యాడ్ ల్యాండింగ్ స్థలాలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశీలించారు. సభకు వృద్ధులను తీసుకురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేటాయించిన పనులను గడువులోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, అర్బన్ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఐఅండ్‌పీఆర్ డీపీఓ గురుస్వామిశెట్టి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ నాగరాజారావు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాద్, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఐఎంఎస్ పీడీ ఫిరోజ్‌ఖాన్, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, డీటీసీ వీర్రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్‌బాషా, డీఈఓ నాగరాజు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుల్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, డీఎస్‌ఓ శోభారాణి, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

- హామీ నిలబెట్టుకున్న సీఎం జగన్
- డ్వాక్రా మహిళలను వంచించిన ఘనుడు చంద్రబాబు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్ద పీట వేసిందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాల మాఫీకి సంబంధించి 'వైఎస్సార్ ఆసరా' అమలు చేస్తున్నారన్నారు. ఈ నెల 23న వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సొమ్ము విడుదల చేసేందుకు సీఎం జగన్ ఉరవకొండ వస్తున్నారన్నారు. శనివారం మంత్రి పెద్దిరెడ్డి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని, ఎవ్వరూ కంతులు చెల్లించవద్దని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని అమలు చేయకుండా మహిళలను మోసగించారని విమర్శించారు. బాబు మాటలు నమ్మి కంతులు చెల్లించకపోవడంతో డ్వాక్రా సంఘాలన్నీ డీఫాల్టర్లుగా ముద్రపడ్డాయన్నారు. తానిచ్చిన హామీకి కట్టుబడి సీఎం జగన్ రుణమాఫీ సొమ్మును డ్వాక్రా మహిళలకు దశల వారీగా చెల్లిస్తూ వస్తున్నారన్నారు. డ్వాక్రా గ్రూపుల పరపతి పెంచి.. విరివిగా బ్యాంకు రుణాలు మంజూరు చేస్తున్నారన్నారు. వివిధ పథకాల ద్వారా మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఓటర్ల తుది జాబితా

అనంతపురం అర్బన్: ఈ నెల 22న ఓటర్ల తుది జాబితాను బూత్‌స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రదర్శించాలని ఎన్నికల రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 అంశంపై రోల్ అబ్జర్వర్ శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి ఈఆర్‌ఓలతో సమీక్షించారు. ఎలక్టోరల్ పాపులేషన్, జెండర్ రేషియోను, క్లెయిమ్ పరిష్కార నివేదికలను పరిశీలించారు. అనంతరం మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి క్లెయిమ్‌నూ సూక్ష్మ పరిశీలన చేయాలని సూచించారు. ప్రధానంగా 9వ తేదీ తరువాత అందిన క్లెయిమ్‌ల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఏదైనా క్లెయిమ్ రెండోసారి వచ్చిందా అనేది పరిశీలించాలని చెప్పారు. ఓటర్ల తుది జాబితాలను 22న సమావేశం నిర్వహించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణీసుస్మిత, ఈఆర్‌ఓలు సుధారాణి, వెంకటేశ్వర్లు, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో రిపోర్టులను పరిశీలిస్తున్న ఎన్నికల రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి

రీసెర్చ్ వైవాకు 'ఖాకీ' విద్యార్థి



వైవాకు హాజరైన ఐజీ అశోక్‌కుమార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ విభాగంలో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ రీసెర్చ్ వైవాకు హాజరయ్యారు. ఎంబీఏ ప్రొఫెసర్ మేఘరాజు పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేస్తున్నారు. వైవాకు హాజరైన అశోక్‌కుమార్ తన పరిశోధన గురించి వివరించారు. వైవా కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. త్వరలోనే ఆయనకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందించనుంది.

ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: లేపాక్షి నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన ఈ పరీక్ష కోసం మొత్తం 34 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,857 మంది విద్యార్థులకు గాను 4,871 మంది హాజరయ్యారు. డీఈఓ వి.నాగరాజు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్, డిప్యూటీ డీఈఓ బి.శ్రీనివాసరావు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

క్లుప్తంగా

మహిళ మెడలో గొలుసు అపహరణ

అనంతపురం క్రైం: స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు ఓ మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కుని ఉడాయించారు. త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్ తెలిపిన మేరకు... లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్న మైమున్ అనే వృద్ధురాలు శనివారం ఉదయం వాకింగ్ కోసం ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఈ క్రమంలోనే బైకుపై వచ్చిన ఇద్దరు యువకులు ఆమెను మాటల్లో ఉంచి మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కుని ఉడాయించారు. హఠాత్పరిణామంతో భయాందోళనకు గురైన వృద్ధురాలు గట్టిగా కేకలు వేసింది. స్థానికుల సమాచారంతో సీఐ ధరణీకిషోర్ ఘటనాస్థలిని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

అనంతపురం క్రైం: స్థానిక నవోదయ కాలనీలో రోహిత్ (30) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ శివరాముడు తెలిపిన మేరకు.. పశ్చిమ బెంగాలు రాష్ట్రం బొట్బాలుకు చెందిన రోహిత్ (30) చెక్కపని చేసేవాడు. తన వద్ద కొంత మంది కూలీలను ఉంచుకున్నాడు. కొన్ని రోజుల క్రితం నవోదయ కాలనీలో జరుగుతున్న ఓ ఇంటిలో ఉడ్ వర్క్ చేయడానికి వచ్చాడు. అదే ప్రాంతంలో కూలీలతో పాటు ఓ గది అద్దెకు తీసుకున్నాడు. తన వద్ద పని చేసే యువకుడితో కలసి శుక్రవారం రాత్రి పడుకున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ, శనివారం ఇంటికి కొంత దూరంలో రోహిత్ విగత జీవిగా పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా తెలుసుకున్న యువకుడు విషయాన్ని టూటౌన్ పోలీసులకు చేరవేశారు. వారు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. రోహిత్‌ను ఎవరో రాత్రి ఇంట్లోంచి బయటకు పిలిపించినట్లు తెలుస్తోంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

చిరుధాన్యాల పుట్టినిల్లు 'అనంత'

- సాగు, వినియోగం పెరిగేలా చూడాలి
- భావితరాల మనుగడ కోసం ప్రోత్సహించాలి
- 'మిల్లెట్ మేళా'లో వక్తల పిలుపు





చిరుధాన్యాల ప్రాముఖ్యత తెలిపే పుస్తకం ఆవిష్కరిస్తున్న మేయర్ వసీం, మాంఛో ఫెర్రర్, మల్లారెడ్డి, రాంబాబు, తదితరులు, మేళాలో అమ్మకానికి ఉంచిన చిరుధాన్యాలు

అనంతపురం అగ్రికల్చర్: చిరుధాన్యాల సాగుకు అనంతపురం జిల్లా పుట్టినిల్లు లాంటిదని, భావితరాల మనుగడ కోసం చిరుధాన్యాలను చిన్నచూపు చూడకుండా పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఎగ్జిబిషన్ మైదానంలో 3 రోజుల పాటు జరిగే 'మిల్లెట్ మేళా' శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నగర మేయర్ వసీం సలీం మాట్లాడుతూ... ఆధునిక ఆహారపు అలవాట్లతో రోగాలు కొనితెచ్చుకుంటున్నారని తెలిపారు. చిరుధాన్యాలపై అవగాహన కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి మాట్లాడుతూ... 50 సంవత్సరాల క్రితం 90 శాతం విస్తీర్ణంలో రైతులు చిరుధాన్యపు పంటలు సాగు చేసేవారన్నారు. వర్షాభావ పరిస్థితులు, కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రజలను ఈ పంటలు ఆదుకున్నాయని గుర్తు చేశారు. వర్షాధారంగా రైతులు నష్టపోరాదంటే చిరుధాన్యాల సాగు శ్రేయస్కరమని తెలిపారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ మాట్లాడుతూ... గతంలో ప్రతి ఇంటా రాగిముద్ద, సద్దరొట్టె లాంటి ఆహారోత్పత్తులు ఉండేవన్నారు. మంచివి పోగొట్టుకుని చెడువి తెచ్చుకున్నందున ప్రజారోగ్యం, పర్యావరణ దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరు మేల్కొంటే చిరుధాన్యాలకు పూర్వవైభవం వస్తుందని తెలిపారు. ప్రకృతి వనం ఫౌండర్ ఎన్‌సీవీ ప్రసాద్ మాట్లాడుతూ.. కొర్రలు, సామలు, ఊదలు లాంటి వాటితో తయారు చేసిన ఆహారం చాలా శక్తివంతమైనదన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు పంతంగి రాంబాబు మాట్లాడుతూ... చిరుధాన్యాల సాగుకు రాయలసీమ పెట్టనికోట అని, అందులోనూ అనంతపురం జిల్లా ముందు వరుసలో ఉంటుందన్నారు. కాలక్రమేణా వీటి ప్రాధాన్యత తగ్గిపోవడంతో ఆహారపు అలవాట్లలో పెనుమార్పులు వచ్చాయన్నారు. దీంతో ఎన్నో దుష్పరిణామాలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వాతావరణంలో కూడా పెనుమార్పులు సంభవిస్తున్నాయని, ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు మూడు డిగ్రీలు పెరగడంతో ఉత్తరాది రాష్ట్రాల్లో 15 శాతం మేర వరి, గోధుమల దిగుబడి తగ్గిపోయినట్లు గుర్తు చేశారు. వీటన్నింటికీ పరిష్కారం చిరుధాన్యాల సాగు, వినియోగం పెంచడమేనని స్పష్టం చేశారు. కొర్రలు, రాగులు, జొన్నలు, ఊదలు, అరికలు, అండుకొర్రలు లాంటి చిరుధాన్యాలు, పప్పుదినుసుల పంటల సాగు, వాటి ఆహారోత్పత్తులు, చిరుతిళ్లను ప్రోత్సహిస్తే రైతులు, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీసీడీ డైరెక్టర్ శాస్త్రి, కార్డు ప్రతినిధి నిర్మలారెడ్డి, రెడ్స్ ప్రతినిధి భానుజ, సీఈఓ మురళీకృష్ణ, ఇతర ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా ప్రదర్శనలు..

ఆర్డీటీ, ఏఎఫ్ ఎకాలజీ, టింబక్టు, కార్డు, రెడ్స్, ఏపీ మాస్, రిడ్స్, స్వచ్ఛ కాఢ్యమ్, ఫార్మ్‌వేద, ఎర్త్ 360, పాస్, వాసన్, ఆర్గానిక్ అనంత, సీఎస్‌ఏ, మిల్లెట్ మ్యాజిక్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ తదితర స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా 'మిల్లెట్ మేళా' ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఎన్‌జీఓలతో పాటు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలు, విక్రయశాలలు ఆకట్టుకున్నాయి. ప్రాంగణాన్ని చిరుధాన్యాలతో కూడిన రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. చిరుధాన్యాలతో కూడిన చిరుతిళ్లు, ఆహారోత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు చేపట్టారు.

సూపర్ స్పెషాలిటీలో ఖరీదైన శస్త్రచికిత్సలు




శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులతో న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రూ.లక్షల విలువైన శస్త్రచికిత్సలను ఉచితంగా చేశారు. ఈ మేరకు సర్వజనాస్పత్రి కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. నల్లచెరువుకు చెందిన 75 ఏళ్ల వెంకటరమణ, బుక్కచెర్లకు చెందిన 75 ఏళ్ల సూర్యచారి, కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన మారెక్కలకు తలకు, వెన్నెముకకు చేసిన శస్త్రచికిత్సలు విజయవంతమైనట్లు వివరించారు. ఈ సందర్భంగా న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, తదితరులను ఉన్నతాధికారులు అభినందించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య


జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అక్షయ మృతదేహం



మృతుడు జగన్ మోహన్ నాయక్



ఆత్మహత్య చేసుకున్న పెద్దన్న

తాడిపత్రి అర్బన్: చదువుకోమని తల్లిదండ్రులు మందలించినందుకు ఓ ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం పొందిన ఘటన పట్టణంలోని విజయనగర్‌కాలనీలో చోటు చేసుకుంది. అర్బన్ ఎస్ఐ రామక్రిష్ణ తెలిపిన మేరకు.. విజయనగర్ కాలనీకి చెందిన సోమేష్‌కుమార్, ధనలక్ష్మి దంపతులు. వీరి కుమార్తె డి.అక్షయ (17) స్థానిక సాయి సిద్దార్థ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి అక్షయను బాగా చదువుకోవాలంటూ తల్లిదండ్రులు మందలించారు. శనివారం ఉదయం ఏదో పని నిమిత్తం బయటకు వెళ్లిన తల్లిదండ్రులు.. తిరిగి వచ్చేలోపే అక్షయ ఫ్యానుకు ఉరి వేసుకుంది. కిందికి దించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే అక్షయ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి సోమేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

స్కూలుకు వెళ్లమన్నారని..

ఆత్మకూరు: స్కూలుకు వెళ్లమన్నారనే మనస్తాపంతో బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వేపచెర్ల దిగువతండా గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. వేపచెర్ల దిగువతండా గ్రామానికి చెందిన గోవిందనాయక్, ప్రభావతికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు జగన్‌మోహన్ నాయక్ (14) అనంతపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. ఆదివారంతో సెలవులు పూర్తవుతుండడంతో ఇక స్కూలికి వెళ్లమని శనివారం ఉదయం తల్లిదండ్రులు చెప్పారు. అనంతరం పొలంలోకి వెళ్లారు. మధ్యాహ్నం జగన్‌మోహన్ నాయక్ వారికి భోజనం క్యారీ ఇచ్చి ఇంటికి వచ్చాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న స్థితిలో కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. గోవింద్ నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో రియల్ వ్యాపారి..

అనంతపురం క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని మారుతీ లాడ్జిలో ఓ వ్యక్తి గది అద్దెకు తీసుకుని రియల్‌ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతని వద్ద 40 ఏళ్లుగా గుమస్తాగా పని చేస్తున్న పెద్దన్న (60), నాగరత్నమ్మ దంపతులు స్థానిక శాంతినగరులో నివాసం ఉంటున్నారు. పెద్దన్న కొన్ని చోట్ల పెట్టుబడులు కూడా పెట్టి నష్టపోయాడు. ఈ క్రమంలోనే కార్యాలయ యజమాని ఏడాదికి పైగా రియల్ ఎస్టేట్ వ్యాపారం వైపు కన్నెత్తి చూడకపోవడంతో పెద్దన్నకు ఆదాయం తగ్గిపోయింది. దీంతో తెలిసిన వారి నుంచి కొంత మొత్తంలో అప్పు చేశాడు. రోజులాగానే శనివారం ఉదయం ఆఫీసుకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన పెద్దన్న మధ్యాహ్నం మారుతీ లాడ్జిలోని రియల్ ఎస్టేట్ కార్యాలయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. తన చావుకు కారణాలను తెలుపుతూ 3 పేజీల లేఖ రాసుకుని జేబులో ఉంచుకున్నాడు. అందులో అప్పులిచ్చిన వారి వేధింపుల ప్రస్తావన ఉన్నట్లు తెలిసింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుయ్యారు. పోలీసులు మృతదేహం వద్ద లభించిన సూసైడ్‌నోట్ స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు.

ఆటోడ్రైవర్ నిర్లక్ష్యానికి బాలుడి బలి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన బాలుడు మహేంద్ర

కంబదూరు: ఆటోడ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ బాలుడి ప్రాణం గాల్లో కలిసిపోయింది. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని ఎం కుర్లపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి, కొల్లన్న దంపతుల కుమారుడు మహేంద్ర (12) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5 వతరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో శనివారం స్నేహితులు భానుప్రసాద్, మనోహర్‌తో కలిసి గ్రామ సమీపంలో ఆడుకొంటున్నాడు. అదే సమయంలో కర్ణాటకలోని దల్వపల్లికి చెందిన మారెప్ప ఆటోలో చింతకాయల కోసం గ్రామానికి వచ్చారు. ఆటో ఎక్కి ఆడుకుంటున్న పిల్లలతో కలిసి కూలీలకు భోజనం తీసుకురావడానికి కంబదూరు బయలుదేరాడు. మార్గమధ్యలో నిర్లక్ష్యంగా బ్రేక్ వేయడంతో పిల్లలు ఎగిరి కిందపడ్డారు. స్థానికులు వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మహేంద్ర ప్రాణాలు విడిచాడు. భానుప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ యతీంద్ర

ముదిగుబ్బ: మహిళ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో కేసు వివరాలను సీఐ యతీంద్ర వెల్లడించారు. బత్తలపల్లి మండలం ఎం.చెర్లోపల్లికి చెందిన చెరికూరి ఆదినారాయణ అనంతపురంలోని రామ్‌నగర్‌లో నివసిస్తూ చీటీల వ్యాపారం చేసేవాడు. అక్కడే దరిశ లక్ష్మీదేవి అనే మహిళతో పరిచయం పెంచుకున్నాడు. వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఈ క్రమంలోనే ఆమె మరో వ్యక్తితో చనువుగా ఉండడం చూసి రగిలిపోయాడు. ఎలాగైనా ఆమెను అంతమొందించాలని భావించాడు. ఈ నెల 16న లక్ష్మీదేవికి మాయ మాటలు చెప్పి ద్విచక్ర వాహనంలో దొరిగిల్లు ఘాట్‌కు తీసుకొచ్చి మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెను ఆమె చీరతోనే గొంతు బిగించి చంపేసి పరారయ్యాడు. మృతురాలి కుమార్తె నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం రాళ్ల అనంతపురం సమీపంలో అరెస్టు చేశారు.

పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం

అనంతపురం క్రైం: పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. విధుల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలుసుకున్నారు. సిబ్బందికి ఏ ఇబ్బంది కలిగినా తనతో పంచుకోవచ్చని చెప్పారు. సమస్యలను పరిష్కరిస్తానన్నారు. సమష్టిగా పని చేస్తే మంచి ఫలితాలు చూడవచ్చని తెలిపారు.

అరటి తోట దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

ఆత్మకూరు: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన అరటి పంట చేతికి వచ్చే సమయంలో అగ్నికి ఆహుతైంది. దాదాపు రూ.12 లక్షల నష్టం వాటిల్లడంతో రైతు ఆవేదన వర్ణనాతీతంగా మారింది. వివరాలు.. ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన ఎంపీటీసీ పోతులయ్య తన 6 ఎకరాల్లో అరటి పంట సాగు చేశాడు. 10 రోజుల్లో పంట కోత కోయాల్సి ఉంది. శనివారం ఉదయం పొలంలో మంటలు గుర్తించిన గొర్రెల కాపర్లు వెంటనే పోతులయ్యకు ఫోన్ చేశారు. ఆయన పలువురు గ్రామస్తులతో కలసి పొలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అదుపు కాకపోవడంతో ఫైర్ ఇంజిన్‌కు సమాచారమిచ్చారు. వారు వచ్చి మంటలు ఆర్పే లోపే పంట మొత్తం దగ్ధమైంది. 40 డ్రిప్ కట్టలు, 150 స్ప్రింక్లర్ పైపులు, 40 పీవీసీ పైపులు, సర్వీస్ వైర్ కూడా కాలిపోయాయి. దీంతో రూ.12 లక్షల వరకు నష్టం జరిగిందని రైతు పోతులయ్య వాపోయారు. 10 రోజుల్లో కోత కోయాల్సి ఉందని, పంటను అమ్మి ఉంటే దాదాపు రూ.10 లక్షల వరకు వచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

రామమందిర ప్రారంభం శుభపరిణామం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



శ్రీరాముని చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న పురందేశ్వరి

అనంతపురం కల్చరల్: దేశ ప్రజలందరి ఆకాంక్షలు, ఆశయాలకనుగుణంగా ఈనెల 22న అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభం కానుండడం శుభపరిణామమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. శనివారం నగరంలో నిర్వహించిన అయోధ్య రామమందిర కరపత్రాల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. మొదటిరోడ్డు మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 7వ క్రాసులో కాశీవిశ్వేశ్వరాలయం మాజీ చైర్మన్ జీజే వేణు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య రామమందిర ఏర్పాటుకు సంఘీభావంగా ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హిందుత్వ కార్యకర్తలు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో అయోధ్య రామమందిర విశిష్టత గురించి మాట్లాడారు.

బైకు అదుపుతప్పి విద్యార్థి మృతి





అభిరామ్ మృతదేహం

గుత్తి రూరల్: బైకు అదుపుతప్పి విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి హరికృష్ణ, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు అభిరామ్(14) గుత్తి పట్టణంలోని కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో ద్విచక్ర వాహనం నడపడం నేర్చుకుంటున్నాడు. శనివారం బైక్ నేర్చుకుంటున్న సమయంలో అదుపు తప్పింది. పాఠశాల ప్రహరీని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అభిరామ్‌ను స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తేనెటీగల దాడిలో బాలురకు గాయాలు

- ఆస్పత్రికి తరలిస్తుండగా రోడ్డు ప్రమాదం
- వ్యక్తికి తీవ్రగాయాలు





తేనెటీగల దాడిలో గాయపడిన బాలురు

హిందూపురం: హిందూపురం మండలం బీరేపల్లి వద్ద ముగ్గురు బాలురపై తేనె టీగలు దాడి చేశాయి. బాధితులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వివరాలు... శనివారం బీరేపల్లి వద్ద చెట్టుపై నుంచి తేనెతుట్టె కింద పడింది. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న ముగ్గురు బాలురపై తేనెటీగలు దాడి చేశాయి. ముఖం, వీపుపై కరిచాయి. గాయాలపాలైన వారిని గిరి అనే వ్యక్తి మోటార్ బైక్‌పై హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా లారీ ఢీ కొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 వాహనంలో అతడిని, తేనె టీగల దాడిలో గాయపడిన బాలురను ఆస్పత్రిలో చేర్చారు. బాధితులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను కోరారు. ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ



శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్న భజన బృందం సభ్యులు

కనగానపల్లి: మండల కేంద్రంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను భక్తులు శనివారం ఇంటింటా పంపిణీ చేశారు. గ్రామంలోని శ్రీరామ భజన బృందం సభ్యులు రామ కీర్తనలను పాడుకుంటూ ఊరేగింపుగా వెళ్లి, ఇంటింటా పంపిణీ చేశారు. సోమవారం అయోధ్యలో జరిగే రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రజలు ఈ అక్షింతలను తలపై వేసుకొని శ్రీరామున్ని స్మరించుకోవాలని భక్తులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తిరుమలదేవర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని డీ4 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. హౌసింగ్ బోర్డు, నవోదయ కాలనీ, బెంగళూరు రోడ్డు, హమాలీ కాలనీ, భైరవ నగర్, శారదానగర్, బుడ్డప్పనగర్, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

కుల గణన సర్వే పకడ్బందీగా చేయండి



రాప్తాడులో కులగణనను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సాల్మన్

రాప్తాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో చేపడుతున్న కులగణనను పకడ్బందీగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సాల్మన్ సూచించారు. మండల వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కులగణన చేస్తున్నారు. శుక్రవారం ఎంపీడీఓ రాప్తాడు, ప్రసన్నాయపల్లి, హంపాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న కులగణన సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 28లోపు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కులగణన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. యాప్‌లో కులగణన సర్వే అంశాలను సమగ్రంగా పొందుపరచాలన్నారు.

ఆధ్యాత్మిక మార్గంతోనే ఉత్తమ జీవితం



సంస్థాన పూజలు చేస్తున్న పీఠాధిపతులు

అనంతపురం కల్చరల్: మనిషికి మానసిక ప్రశాంతతనిచ్చి ఉత్తమ జీవితాన్ని ప్రాప్తింపజేసేది ఆధ్యాత్మిక మార్గమేనని వ్యాసరాజ మఠం పీఠాధిపతులు విద్యాశ్రీశ తీర్థులు ప్రబోధించారు. కర్ణాటకలోని సోసలే పీఠం నుంచి హైదరాబాదు వెళ్తూ మార్గంమధ్యలో నగరంలోని పాతూరు వ్యాసరాజ మఠంలో విడిది చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం ఆస్థాన పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అనంతరం స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. సాయంత్రం వ్యాసరాజ దర్బారు కార్యక్రమం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. అనంతరం తొట్లోత్సవం నిర్వహించారు.

అధైర్య పడకండి .. అండగా ఉంటాం



ఆదిలక్ష్మి మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చందు

ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లోని బాధిత కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చందు శనివారం పరామర్శించారు. వేపచెర్ల దిగువ తండాలో జగన్‌మోహన్ నాయక్ అనే విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బిడ్డ కోల్పోయిన తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. మండలంలోని తలుపూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగిరెడ్డి భార్య ఆదిలక్ష్మి అనారోగ్యంతో మరణించింది. దీంతో ఆదిలక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తలుపూరుకు చెందిన ఎర్రిస్వామి యాదవ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, అతన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







పిట్టమడిలో సాగుబడి

చుట్టూ ఎటుచూసినా పచ్చని వరిపైర్లు.. అక్కడక్కడ పిట్టమడుల్లో యంత్రసాయంతో సేద్యం చేస్తుంటే.. పురుగుల కోసం విహంగాలు హంగామా చేస్తుంటే.. సూర్యాస్తమయ వేళ.. అనంతపురం – తాడిపత్రి రహదారి పక్కన రెడ్డిపల్లి సమీపంలో అద్భుత చిత్రం ఆవిష్కృతమైంది. పొద్దుకుంకుతోందని రైతన్న హడావుడి చేస్తుంటే.. పురుగుల కోసం కొంగలు వేటాడుతుంటే ఎ'వరి' పని వారిదన్నట్లు పిట్టమడిలో సాగుబడిలా కనిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

అన్ని వర్గాల అభ్యున్నతికి కుల గణన సర్వే



ఎంబ్రాయిడరీ కుట్టుమిషన్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే ద్వారా అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరంలోని 29వ డివిజన్ పరిధిలో జరుగుతున్న సమగ్ర కులగణన సర్వేను మేయర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కులగణను పారదర్శకంగా చేపట్టాలని ప్రతి కుటుంబాన్ని సర్వే చేయాలన్నారు. నిర్దేశిత గడువులోపు సర్వేను పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని మేయర్ ఆదేశించారు. కులగణన ద్వారా ప్రజల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలు కోసం జనాభా ప్రాతిపదికన అవసరమైన బడ్జెట్ కేటాయింపు, విధాన నిర్ణయాలు అమలు చేయడానికి మరింత సులువుగా ఉంటుందన్నారు. అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్ సైపుల్లాబేగ్, నాయకులు జావేద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు కృషి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం నగరంలోని సాయినగర్‌లో మెప్మా సహకారంతో మహిళా సంఘాల సభ్యురాలు ఏర్పాటు చేసిన ఎంబ్రాయిడరీ కుట్టు మిషన్‌ను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలిసి మేయర్ ప్రారంభించారు. ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేసేలా సీఎం జగనన్న చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతి మహిళ ఆర్థిక స్వేచ్ఛ కలిగి ఉండాలని, అందుకోసం మహిళలు స్వయం ఉపాధి మార్గాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. యువతులకు, మహిళలకు స్వయం ఉపాధిలో ప్రోత్సాహం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. తక్కువ కాల వ్యవధిలో స్వయం ఉపాధి చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఎంబ్రాయిడరీ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాంజనేయులు, సైపుల్లాబేగ్, నాయకులు మధు, కాశర్ల శీన, టీపీఆర్ఓ విశ్వజ్యోతి, టీఎంసీ శ్రీనివాస్ రెడ్డి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాప్తాడు: స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సీనియర్ త్రోబాల్ జట్టు పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, పీడీలు కేశవ మూర్తి, రాజశేఖర్ రెడ్డి, ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి త్రోబాల్ జట్టు ఎంపిక జరిగింది. జిల్లా నలుమూలల నుంచి దాదాపుగా 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో దాదాపుగా 16 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా, వారిలో రాప్తాడు జెడ్పీహెచ్ఎస్ నుంచి నరసింహ, అంజలి, నవ్య, హేమలత, భవిత, పవిత్ర, ఇందు, పూజ నందిని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 27న సత్యసాయి జిల్లాలోని బత్తలపల్లిలో పవన్ కుమార్ రెడ్డి మెమోరియల్ స్టేడియంలో జరుగుతాయన్నారు. విద్యార్థులను ముక్కోటి అంబికా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు దంపెట్ల శివ అభినందించారు. కార్యక్రమంలో త్రోబాల్ సంఘ సభ్యులు శివ, శివకుమార్, రాజు, నాగేష్, చైతు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అమోఘం..వేంకటేశ్వరుడి వైభవం



ప్రవచనం చెప్తున్న ఆధ్యాత్మిక ప్రసంగీకులు అన్నాజీ

అనంతపురం కల్చరల్: కలియుగ ప్రత్యక్ష దైవంగా పూజలందుకుంటున్న శ్రీనివాసుడి లీలా విశేషాలను ఎంత చెప్పుకున్నా తక్కువేనని ప్రముఖ ప్రవచన కర్త అన్నాజీ అన్నారు. నగరంలోని ఆర్ఎఫ్‌రోడ్డు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో వారం రోజులపాటు సాగే వేంకటేశ్వరస్వామి వైభవ సప్తాహ కార్యక్రమం శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మిక గాయకులు పాలసముద్రం నాగరాజు మాట్లాడుతూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వైభవం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. తిరుమల గిరులలో నిత్యం ధ్వనించే నామస్మరణ వెనుక అనేక గాథలున్నాయన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, నాయక్, విష్ణు సహస్రనామ పారాయణ సంఘం నిర్వాహకులు మేడా వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులు నిర్లక్ష్యం చేయొద్దు

- నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ వై.మేఘస్వరూప్

అనంతపురం కార్పొరేషన్: జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వై మేఘస్వరూప్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం కోవూర్‌నగర్, అరవింద నగర్‌లో ఉన్న సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో హాజరు పట్టిక, ఇన్‌స్పెక్షన్, స్పందన రిజిష్టర్లు, నోటీసు బోర్డుతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోగా పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని, తమకు నిర్దేశించిన పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో కులగణన సర్వేను కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

తిరుమల దేవర ఆలయంలో ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని గంగంపల్లి సమీపంలోని తిరుమల దేవర ఆలయంలో వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఉదయాన్నే స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించారు. పూజల్లో మండల వాసులేకాక, కర్ణాటక, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండల వాసులు పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో రోజూ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు విద్యార్థి ఎంపిక

గుంతకల్లుటౌన్: ఈ నెల 26న విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి ఎం.శ్రీకాంత్ ఎంపికయ్యాడు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు శనివారం కళాశాలలో సదరు విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జనార్దన్‌శాస్త్రి, రవిశంకర్ శర్మ, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ బాలకృష్ణ, కార్యాలయ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బుక్కరాయసముద్రం: కర్ణాటక, తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం రవాణా చేసినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని తాడిపత్రి, అనంతపురం రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం, గుట్కా, మత్తు పదార్థాలు రవాణా పూర్తిగా నిషేధమని, వాటిని రవాణా చేస్తే సహించేది లేదన్నారు. ఎవరైనా వాటిని రవాణా చేసినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. మండల కేంద్రంలో ఇక నుంచి రోజూ పోలీసుల తనిఖీ ఉంటుందన్నారు. వాహనదారులు వాహన రికార్డులను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఈసందర్భంగా రికార్డులు లేని పలు వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎస్ఐ ఆదినారాయణ, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

24న భోగేశ్వరాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పామిడి: పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భోగేశ్వరాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి చొరవతో రూ.కోటి సీజీఎఫ్ నిధులతోపాటు భక్తుల రూ.40 లక్షల విరాళంతో కలిపి మొత్తం రూ.1.40 కోట్లతో విమానగోపురం, ఆలయ పునర్నిర్మాణం చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వైవీఆర్‌తో పాటు రాష్ట్ర దేవదాయ శాఖామాత్యులు కే సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీ రంగయ్య తదితర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

23 నుంచి అంకాలమ్మ, కుంటెమ్మ జాతర

పామిడి: స్థానిక పీ కొండాపురంరోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటెమ్మ 16వ జాతర ఈనెల 23 నుంచి రెండురోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. జాతరను పురస్కరించుకొని 23న పాలపళ్ల విభాగం, 18న న్యూ కేటగిరీ విభాగాల్లో రాతిదూలం లాగుడు పోటీలు ఉంటాయన్నారు. పాలపళ్ల విభాగంలో విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, న్యూ కేటగిరి విభాగంలో రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.15వే లు, రూ.10వేలు నగదు బహుమతులు అందజేస్తామని వివరించారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోడ్ నెస్ట్ క్యాంపస్ లీడ్ ఆఫీసర్ పునీత్ పేర్కొన్నారు. శనివారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కోడ్‌నెస్ట్ ఈటెక్, ఉత్పత్తి ఆధారిత సంస్థ సీఎస్ఆర్ డ్రైవ్-2024 క్యాంపస్ డ్రైవ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. కంపెనీల ప్రత్యేకతలు, ఏ విధంగా ఉపాధి పొందాలో తెలిపారు. కళాశాలలో నిర్వహించిన కోడ్‌నెస్ట్‌కు 58 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వీరికి స్క్రీనింగ్ టెస్ట్, ముఖాముఖి ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోడ్‌నెస్ట్ ప్రతినిధులు రిషి, రఘుల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న, జైశ్రీరామ్ భక్త మండలి సభ్యులు

తాడిపత్రి అర్బన్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని పట్టణంలో జై శ్రీరామ్ భక్తమండలి ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన సాగింది. భక్తమండలి అధ్యక్షుడు నిచ్చనమెట్ల రాధాకృష్ణ, బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం ప్రధాన అర్చకుడు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్థానిక వాల్మీకి సర్కిల్‌లోని వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి హనుమాన్ చాలీసా పఠిస్తూ సీబీరోడ్డు మీదుగా హనుమాన్ జంక్షన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మెయిన్‌బజార్ మీదుగా గాంధీకట్ట వద్దకు చేరుకున్నారు. అక్కడ మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా రామనామస్మరణతో వీధులన్నీ మార్మోగిపోయాయి. పట్టణమంతా కాషాయ జెండాలతో దర్శనమిచ్చింది. బీజేపీ నాయకులు అంకాల్‌రెడ్డి, పోతుల గంగాధర్‌యాదవ్, రామాంజనేయులు, ఈశ్వర్‌రాజు, సింగరి లక్ష్మినారాయణ, ఏబీవీపీ నాయకులు అఖిల్‌కుమార్‌రెడ్డి, మనోజ్, గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

యల్లనూరు: మండల కేంద్రం శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2,460 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. ఇదిలా ఉండగా బుక్కాపురం గ్రామంలో వీర లక్ష్మమ్మ అనే మహిళ మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితురాలి నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

25న అశ్వత్థంలో వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో మాఘమాసం తిరునాల సందర్భంగా టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఈ నెల 25న బహిరంగ వేలం జరగనుంది. ఈ మేరకు ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసులు రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనే వారు రూ.50 వేలు అడ్వాన్స్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నాటుసారా పట్టివేత

కూడేరు: మండలంలోని మరుట్ల-2వ కాలనీ వద్ద శనివారం ఎస్ఐ సత్యనారాయణ, తన సిబ్బందితో కలసి 30 లీటర్ల నాటు సారాని పట్టుకున్నారు. ఆత్మకూరు మండలం మదిగుబ్బ తండాకి చెందిన ఇద్దరు వ్యక్తులు పామిడి మండలం కోనేపల్లి తండా నుంచి ద్విచక్ర వాహనంలో 30 లీటర్ల నాటు సారాను బాటిళ్లలో తీసుకువెళ్తుండగా పోలీసులు కాపుకాచి పట్టుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ జమేదార్ వెంకటేశులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నానీల నాగేంద్రకు గిడుగు సాహితీ పురస్కారం



నానీల నాగేంద్ర

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన యువకవి నానీల నాగేంద్ర గిడుగు సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహిత్య, కళారంగాల్లో కృషి చేస్తున్న వారిని వివిధ జిల్లాల నుంచి ఎంపిక చేశారు. నానీల నాగేంద్ర రచించిన 'డాక్టర్ రాచపాలెం సాహిత్య విమర్శ-సమగ్ర అధ్యయనం' పుస్తకాన్ని ప్రత్యేక పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రముఖ కవి బిక్కికృష్ణ తెలిపారు. ఈనెల 28న హైదరాబాదులో జరగనున్న పురస్కార ప్రదానోత్సవంలో అవార్డు, సత్కారాన్ని అందుకోనున్నారు. నాగేంద్రను ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, ఆచార్య బాల సుబ్రమణ్యం, డాక్టర్ పతికి రమేష్ నారాయణ అభినందించారు.

జీజీహెచ్‌లో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం



ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో హైదరాబాద్, అనంతపురం న్యాయవాదులు ఎస్ ఎంటీపీకేకే సబీర కటం, ఎస్ .గోపి సౌజన్యంతో రూ.6 లక్షలతో ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో శనివారం బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. గుంతకల్లు మండలం గుండాలకు చెందిన రామేశ్వరయ్య పని మీద తన స్నేహితునితో కలిసి బైక్‌పై గుత్తికి వచ్చాడు. తిరిగి బైక్‌లో తన ఊరికి బయలు దేరాడు. అయితే గుంతకల్లు రోడ్డులో బైక్ పై నుంచి జారి కింద పడి గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

శింగనమల: రైతులు పంటల సాగులో నూతన పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. శనివారం సోదనపల్లి గ్రామంలో రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చందన, శ్రీకృష్ణదేవరాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ విద్య, రైతులు పాల్గొన్నారు.